క్లుప్తంగా

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు అమ్మవారికి మొక్కుగా చెల్లించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, శంకరయ్య, చిన్నపెద్దన్న, మధు, చిన్నన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఏర్పాటు చేశారు.

కూలిన మట్టిమిద్దె



దంతెలు విరిగి పడటంతో కూలిన ఇంటిపైకప్పు

దొర్నిపాడు: మండలకేంద్రం దొర్నిపాడు హిదయతుల్లాకు చెందిన మట్టిమిద్దె భారీ వర్షాల కారణంగా శనివారం తెల్లవారు జామున కూలిపోయింది. భార్యాభర్తలిద్దరు వరండాలో నిద్రిస్తుండగా పెద్దగా శబ్దం రావడంతో ఇంటి తలుపులు తెరిచి చూడగా పైకప్పు దంతెలు విరిగి పడిపోయాయి. ప్రతి రోజు ఇంట్లో నిద్రిస్తున్న వీరు అనుమానంతో వరండాలో పడుకున్నట్లు బాధితుడు పేర్కొన్నారు. ఇంట్లో వస్తువులు, ధాన్యం పాడయినట్లు వాపోయారు. అధికారులు స్పందించి ఆర్థిక సాయం చేయాలని కోరారు.

ఆర్థిక సాయం



రుద్రవరంలో ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్ర బృందం

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 10వ తరగతికి చెందిన 2007 బ్యాచ్ మిత్ర బృందం ఆత్మీయంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని క్షేమ సమాచారం తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దకంబలూరుకు చెందిన భాగ్యలక్ష్మికి చికిత్స నిమిత్తం తోటి మిత్రులు రూ.30వేల నగదును అందజేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు కాశీం, సురేంద్ర, గురు ప్రసాదు, శేషు, పుల్లయ్య, వుశేని, బాల వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ నిర్వాహకులకు నగదు అందజేస్తున్న దాతలు

రుద్రవరం: వెలగల పల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఆర్.కొత్తపల్లి గ్రామానికి చెందిన గంధం శ్రీనివాసరెడ్డి, విజయలలిత దంపతులు శనివారం రూ.100,116 నగదు అందజేశారు. దాతలకు ఆలయ నిర్వాహకులు మధుసూదనరెడ్డి, శ్రీనివాసులు, ఓబులయ్య తదితరులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ

నంద్యాల(న్యూటౌన్): ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆర్ట్స్ అండ్ కల్చర్ హెరిటేజ్ సంస్థ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇంటాచ్ క్విజ్ కాంపిటీషన్ పోటీల్లో గురురాజ ఇంగ్లిషు మీడియ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించినట్లు ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు షేక్షావలిరెడ్డి తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఆదివారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఇంటాచ్ ఆర్గనైజేషన్ కన్వీనర్ శివకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

నంద్యాల(న్యూటౌన్): ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన వరద బాధితులను ఆదుకునేందుకు నంద్యాల పట్టణంలో ఆదివారం సీఐటీయూ నాయకులు విరాళాలు సేకరించారు. ఈ విరాళాలను రాష్ట్ర కమిటీకి పంపి అక్కడి నుంచి విజయవాడ వరద బాధితులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దు, నాయకులు మహమ్మద్‌గౌస్, వెంకటలింగం, తదితరులు పాల్గొన్నారు.



రుద్రవరం..ఎర్రగుడిదిన్నెలో వినాయక విగ్రహం ఎదుట గుమికూడిన చిన్నారులు



దొర్నిపాడు.. గణనాథుడిని పూజిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గణనాథా..నమోస్తుతే!

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి
- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- ప్రథమ పూజలు అందుకున్న పార్వతీ తనయుడు
- మండపాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసిన నిర్వాహకులు



నంద్యాల.. బాలాజీ కాంప్లెక్స్‌లో సామూహిక కుంకుమార్చనలు



నంద్యాల...బొమ్మలసత్రంలో ఏర్పాటు చేసిన బాలగణేష్

నంద్యాల (వ్యవసాయం): వినాయక చవితి సంబరం అంబరాన్నంటింది. వాడవాడల్లో మండపాలను ఏర్పాటు చేసి శనివారం గణనాథులను నెలకొల్పారు. విఘ్నాలు తొలగించే వినాయక తమను చల్లగా చూడాలని భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. నంద్యాల పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ నెలకొల్పిన శ్రీ పంచముఖ బృహచ్ఛద(ఆక్రూట్) మహాగణపతి సందర్శించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలువురు రాజకీయ నాయకులు, ఆధ్యాత్మిక గురువు, సాయిరాం బాబాకు భగవత్ సేవా సమాజ్ సభ్యులు స్వాగతం పలికారు. తర్వాత ఆయన స్వామికి పూజలు చేశారు.

■ స్థానిక బాలాజీ కాంప్లెక్స్‌లోని కల్యాణ మండపంలో మట్టితో ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ మహాగణపతిని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని శిల్పా కుమ్మరి మద్దిలేటి, మధులు తయారు చేశారు.

■ స్థానిక గుడిపాటిగడ్డలోని గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో గణేష్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పడకండ్ల సుబ్రమణ్యం, సుబ్బయ్య, చందు విశేష పూజలు చేశారు.

■ పప్పులబట్టి బజార్‌లో శ్రీలక్ష్మి గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లక్ష్మీ గణేష్ విగ్రహం ఎంతో సుందరంగా ఉండటంతో ప్రజలను ఆకట్టుకుంటుంది.

■ అదే విధంగా సంజీవనగర్ సత్యసాయి కల్యాణ మండపం వద్ద శ్రీవరసిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో గజకేశరి వినాయకుడిని ప్రతిష్ఠించారు.

■ కురువ పేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు కత్తిశంకర్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

■ కోటావీధి బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోస్పాడు: మండలంలో వినాయక విగ్రహాల వద్ద చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రత్యేక పూజలు చేసి వినాయకుడికి నైవేద్యం సమర్పించారు. 80 విగ్రహాల దాకా ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాల వద్ద మూడు రోజుల పాటు పూజలు నిర్వహించి సోమవారం ఆయా గ్రామాల్లోని కాల్వలు, కుంటల వద్ద నిమజ్జనం చేయనున్నారు.

నంద్యాల(అర్బన్): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని కానాల, మిట్నాల, చాపిరేవుల, మునగాల, అయ్యలూరు, పెద్దకొట్టాల తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు సోమవారం నిమజ్జనానికి బయల్దేరి వెళ్లనున్నారు.

భక్తి శ్రద్ధలతో...

చాగలమర్రి: మండలంలో సుమారు 85 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. శనివారం మండల కేంద్రం చాగలమర్రిలోని ఆయప్ప స్వామి ఆలయం నుంచి స్వామి వారి విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి కొలువు దీర్చారు. స్థానిక వినాయక నగర్ రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మహిళా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్థానిక ఎస్సీ కాలనీ, ఆంధ్రప్రగతి గ్రామీణా బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు దాత, ప్రముఖ వ్యాపార వేత్త చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్ నగదు విరాళం అందించి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంతో పాటు గ్రామాల్లో వందకు పైగా వినాయక విగ్రహాలను శనివారం కొలువు దీర్చారు. వేద పండితులతో విశేష పూజలు చేయించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. మూడో రోజు సోమవారం గణనాథుల నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


దొర్నిపాడు: మండలంలో వినాయక చవితి పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపాల వద్ద కొలువుంచిన విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మల్లేష్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, చంద్రోఖర్‌రెడ్డి, భరత్‌సింహారెడ్డి, సుబ్బారెడ్డి దుర్గా వెంకట ప్రసాద్‌రెడ్డి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేశారు.

ఉయ్యాలవాడ: మండలంలోని వివిధ గ్రామాల్లో మండపాల్లో కొలువుదీరిన గణనాథులకు వినాయక చవితి పండుగ సందర్భంగా శని, ఆదివారాలు రెండు రోజులుగా భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. స్వామి వారికి ఇష్టమైన ఉండ్రాళ్లు, గరిక, చెరుకుగడలు, ఎలక్కాయలు, సీతాఫలం, చీని, ఆపిల్, మొక్కజొన్న కంకులు, తదితర వాటిని నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేశారు.

శిరివెళ్ల: మండలంలో వినాయక చవితిని పురస్కరించుకుని వంద విగ్రహాలను నెలకొల్పారు. మండపాలను రంగు, రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



గుడిపాటిగడ్డలో కొలువైన అయోధ్య వినాయకుడు



నంద్యాల మండలం మిట్నాలలో గణనాథుడు



వైఎస్ఆర్ నగర్‌లో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



శిరివెళ్లలో ...



ఆర్.జంబులదిన్నెలో...



గోస్పాడు మండలం పసురపాడులో..



చాగలమర్రి వినాయక నగర్‌లో..

తైక్వాండో పోటీలకు ఏపీ టీం కోచ్‌గా అబ్దుల్‌మజీద్



అబ్దుల్‌మజీద్

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఏపీటీం కోచ్‌గా అబ్దుల్‌మజీద్‌ను నియమించినట్లు ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ సీహెచ్ వేణుగోపాలరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అన్ని జిల్లాల నుంచి సబ్ జూనియర్, జూనియర్ విభాగంలో 86 మంది క్రీడాకారులు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టీం కోచ్‌గా అబ్దుల్‌మజీద్ ఎంపిక కావడం అభినందనీయమన్నారు.

పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి పక్కా గృహాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం సలీంనగర్‌లో భూమని శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీల్లో పేరుకుపోయిన మురుగుతో దోమలు వృద్ధి చెంది కాలనీ ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. డ్రైనేజీలు సరిగా లేవని, వీధి దీపాలు వెలగడం లేదన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో అబ్దుల్‌కలాం, జమాల్, రాజు, అల్తాఫ్, అబ్దుల్ వహీద్, సుబ్బరాయుడు, వంశీ సిమ్లా, రవి, పక్కీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా...

- ఇరిగేషన్ కార్యాలయ ఆవరణ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కార్యాలయ అధికారులు



మైనర్ ఇరిగేషన్ కార్యాలయం



కార్యాలయ ఆవరణలో తాగి పడేసిన మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు

నంద్యాల(రూరల్): పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న జిల్లా ఇరిగేషన్ కార్యాలయ ఆవరణ రాత్రిపూట మందుబాబులకు అడ్డగా మారింది. ఈ ఆవరణలో జిల్లా ఇరిగేషన్ కార్యాలయంతో పాటు జిల్లా డివిజన్ కేసీ కెనాల్ కార్యాలయాలు, జిల్లా తెలుగుగంగ కార్యాలయం, జిల్లా భూగర్భ, గనుల శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఈ కార్యాలయాలకు వెళ్లేందుకు మూడు ప్రధాన గేట్లు ఉన్నాయి. అయితే, రాత్రి వేళల్లో అక్కడ ఉన్న రెండు ప్రధాన గేట్లకు తాళాలు వేయకపోవడంతో కార్యాలయ ఆవరణలోకి కార్లు, బైక్‌లలో మందు బాబులు వచ్చి మద్యం సేవిస్తున్నారు. దీంతో కార్యాలయ అధికారులు, సిబ్బంది ఏదైనా ముఖ్యమైన ఫైళ్ల కోసం రాత్రి వేళల్లో వారి కార్యాలయాలకు వెళ్లాలంటే భయందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో వాచ్‌మెన్ ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేయాలని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు.

వీబీఆర్‌లో నిలకడగా నీటిమట్టం

వెలుగోడు: తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటిమట్టం నిలకడగా ఉంది. వీబీఆర్ పూర్తిస్థాయి నీటిమట్టం 16.95 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 14.760 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వీబీఆర్‌లోకి 9,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. అలాగే వీబీఆర్ నుంచి మద్రాసు కాలువకు 5వేలు, స్పిల్ వే ద్వారా గాలేరుకు 6వేలు క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 40 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 20 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి అవసరాలకు 15 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని తెలుగుగంగ ఏఈ శివనాయక్ తెలిపారు.

ఎస్ఆర్ఎంసీలోకి భవనాశి నీరు

పాములపాడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో మండలంలోని భవనాశి వాగు నీరు ఎస్ఆర్ఎంసీ కాలువలోకి లీకేజీతో చేరుతున్నాయి. పాములపాడు –చెలిమిల్ల గ్రామానికి అనుసంధానంగా ఎస్ఆర్ఎంసీపై ఉన్న సూపర్‌ప్యాసేజీ వంతెన వద్ద నీరు లీకవుతున్నాయి.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

గిరిజన ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం (ఏఐఎస్‌టీఈఏ) నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీ ఎస్టీ కమ్యూనిటీ భవనంలో రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా గంగన్న, ప్రధాన కార్యదర్శిగా కేవీ రాములునాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణబాయి, కోశాధికారిగా రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా పక్కీరయ్య, శ్రీనివాసరావు, కాంతరావునాయక్, సీతమ్మ, జాయింట్ సెక్రటరీలుగా వెంకటరమణ నాయక్, బద్దునాయక్, లక్ష్మీనాయక్‌లతో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీగా లింగమయ్య, వనిజలతో పాటు చైర్మన్‌గా మరియదాసును ఎన్నుకున్నట్లు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు ప్రభాకర్ తెలిపారు. అంతకు ముందు రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ సరళీకరణ, కార్పొరేటీకరణ వల్ల ప్రతి గిరిజన కుటుంబం అతలాకుతలమవుతుందన్నారు.

చిత్రకళలో చిన్నారుల ప్రతిభ

నంద్యాల(అర్బన్): హైదరాబాద్‌లో ప్రోగ్రస్ ఆఫ్ ఆర్ట్ బర్డ్స్ అనే సంస్థ కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించిన అంతర్జాతీయ బాలుర చిత్రకళా ప్రదర్శన పోటీల్లో నంద్యాలకు చెందిన కోటేష్ ఆర్ట్ అకాడమీ చిన్నారులు ప్రతిభ చూపారు. 40 మంది చిన్నారులు వేసిన చిత్రాలను ప్రదర్శన పోటీలకు పంపగా అందులో ఆరుగురికి బంగారు పతకాలు, 14 మందికి జ్యూరీ అవార్డ్స్, నలుగురికి డిప్లొమా అవార్డ్స్ వచ్చాయని చిత్రకారుడు కోటేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనరసింహయాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ప్రకటించినట్లు లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. వరుసగా మూడోసారి తనను అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు.

వైద్యులు జాగ్రత్తగా వ్యవహరించాలి



వైద్య వృత్తి చట్టాలపై సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ వీఎస్ ప్రసాద్

నంద్యాల(వ్యవసాయం): రోగులకు చికిత్స అందించే సమయంలో వైద్యులు జాగ్రత్తగా వ్యవహరించాలని రాష్ట్ర ఐఎంఏ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అనుబంధ విభాగం చైర్మన్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రొఫెషనల్ ప్రొటెక్షన్ అనుబంధ విభాగం ఆధ్వర్యంలో స్థానిక సూరజ్ గ్రాండ్ హోటల్ సమావేశ మందిరంలో రాయలసీమ ప్రాంత వైద్యులకు వైద్య వృత్తి సంబంధిత చట్టాలపైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రుల్లో చికిత్స చేస్తున్న సమయంలో అనుకోకుండా విపత్తులు వచ్చినప్పుడు వైద్యులు వ్యవహరించాల్సిన తీరు, బీమా గురించి అవగాహన కల్పించారు. అనంతరం భారతీయ శిక్షా స్మృతిలో వైద్య నిర్లక్ష్యానికి సంబంధించిన చట్టాలు, వీటికి సంబంధించిన సుప్రీం కోర్టు తీర్పులను న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు రవికృష్ణ, మూర్తి, హరిరావు, త్యాగరాజరెడ్డి, హరికుమార్‌రెడ్డి, సాయిప్రసాద్, అనిల్‌కుమార్, విజయభాస్కరరెడ్డి, వసుధారాణి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పండగపూట విషాదం



మృతి చెందిన విద్యార్థి కల్యాణ్

ఉయ్యాలవాడ : వినాయక చవితి పండుగ రోజు సర్వాయిపల్లె గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లింగం చిన్నకర్రెన్న, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె సంతానం. పెద్ద కుమారుడు కల్యాణ్(12) ఉయ్యాలవాడ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. సెలవు కావడంతో శనివారం గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి సరదాగా బావిలో ఈతకు వెళ్లాడు. నీటిలో మూడు మనకలు వేసే సమయంలో అడుగు భాగానికి చేరాడు. ఎంత సేపటికి బయటకు రావకపోవడంతో స్నేహితులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి బావిలోకి దిగి విద్యార్థిని బయటకు తీశారు. విద్యార్థి అప్పటికే మృతి చెందాడు. పండుగ రోజు బాలుగి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి బాధిత కుటుంబానికి సంతాపం తెలిపి రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వాతి వేడుకలు నిర్వహించారు. ఉదయాన్నే వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవా నిర్వహించి అనంతరం స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం మహానైవేద్యం సమర్పించి స్వామి, అమ్మవార్లకు మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మధసూదనరాయల్, అర్చకులు రామ్మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వడ్డెర్లను సన్మానిస్తున్న సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకాంతయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రథమనందీశ్వర ఆలయంలోని వైఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నంద్యాల జిల్లా వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశం రాష్ట్ర కార్యదర్శి చల్లా వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ గత 50ఏళ్లుగా వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని పోరాడుతున్నా పాలకుల నుంచి స్పందన లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చి అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం నంద్యాల జిల్లా వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామసుబ్బయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చక్రదర్, శివభాస్కర్, సర్వేశ్వరబాబు, లక్ష్మణ్, వడ్డె గోపాల్, తదితరులు పాల్గొన్నారు.